# మల్లన్న కల్యాణోత్సవానికి భారీ బందోబస్తు

- నాలుగు సెక్టార్లుగా ఆలయం విభజన
- పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు
- అడిషనల్ డీసీపీలు శ్రీనివాస్‌రావు, మల్లారెడ్డి


పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు

చేర్యాల, జనవరి 6: కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారి కల్యాణ మహోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాస్‌రావు, అడిషనల్ డీసీపీ ఎస్.మల్లారెడ్డి తెలిపారు. శనివారం అడిషనల్ డీసీపీలు ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డితో కలిసి స్వామివారి కల్యాణం నిర్వహించే తోటబావి పరిసర ప్రాంతాలు, వీఐపీ పార్కింగ్, జనరల్ పార్కింగ్, దర్శనాల ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీలు మాట్లాడుతూ ప్రతి అధికారి, సిబ్బంది భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. బందోబస్తు విషయంలో ఎలాంటి సమస్యలున్నా సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. బందోబస్తును నాలుగు సెక్టార్లుగా విభజించామని, తోటబావి కల్యాణ వేదిక, టెంపుల ఆవరణ, ట్రాఫిక్, పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేస్తున్నామని, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు కంట్రోల్ రూంలో అందుబాటులో ఉంటూ భక్తులకు సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు వీఐపీ, శీఘ్ర, సాధారణ దర్శనాలుగా విభజించామన్నారు. కల్యాణ వేదిక, పార్కింగ్ ప్రదేశాలు, టెంపుల్ అవరణలో 80 కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇద్దరు అడిషనల్ డీసీపీలు పర్యవేక్షణలో ముగ్గురు ఏసీపీలు, 12 మంది సీఐలు, 18 మంది ఎస్సైలు, 300 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా పీసీలు, హోంగార్డులు, బీడీ టీమ్స్, యాక్సెస్ కంట్రోల్, రోప్ పార్టీతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### పార్కింగ్ ప్రదేశాలు..

తోటబావి సమీపంలో ఎడమవైపు ఉన్న కాంపౌండ్ వాల్ ప్రదేశంలో వీఐపీల వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. సిద్దిపేట, చేర్యాల, కిష్టంపేట, కొమురవెల్లి కమాన్ నుంచి వచ్చే వాహనదారులు బస్టాండ్ పక్కన్న ఉన్న ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. హైదరాబాద్, కొండపోచమ్మ టెంపుల్, ఐనాపూర్ గ్రామం నుంచి వచ్చే వాహనదారులు కొమురవెల్లి పెట్రోల్ బంక్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో, శ్రీ హోటల్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు సతీశ్, సురేందర్‌రెడ్డి, రమేశ్, రవీందర్‌రాజు, ప్రసన్నకుమార్, సీఐలు, ఎస్సై, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి మఠం సంస్థాపన పూజలు

వర్గల్, జనవరి 5 : నేటి నుంచి రెండురోజులపాటు శ్రీరాఘవేంద్ర బృందావనంలో మఠంసంస్థాపన పూజలు నిర్వహించనున్నట్లు తెలంగాణ మద్వామండలి అధ్యక్షుడు నందగిరి ఉపేందర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధుత్తరాది మఠాధీశులు 1008 పత్యత్మతీర్థశ్రీపాదులవారు హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి మద్వామండలి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు చెప్పారు.

## నేడు అఖండ నామ సంకీర్తన కార్యక్రమం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 6: మద్దూరు మండలంలోని శ్రీసీతారామాంజనేయ శతరుద్రేశ్వరాలయంలో శతకోటి హరే రామ నామ జపయజ్ఞంలో భాగంగా నేడు అఖండ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు మల్లావజ్జుల సూర్యనారాయణశర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు అఖండ నామ సంకీర్తన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భగవంతుడి కృపకు పాత్రులు కావాలన్నారు.

## పని ప్రదేశాల వద్ద పాఠశాలలు ఏర్పాటు చేయాలి

డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి

గజ్వేల్, జనవరి 6 : పని ప్రదేశాల్లో పాఠశాలలను ఏర్పాటు చేసి వలస కూలీల పిల్లలకు విద్యనందించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎగొండస్వామి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల వద్ద చదువుకు దూరంగా ఉన్న పిల్లలను ఆయన కలిసి మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కుటుంబాలకు చెందిన పిల్లలు 17 ప్రదేశాల్లో 480 మంది చదువుకు దూరంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారన్నారు. కార్మికశాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పని ప్రదేశాల వద్ద పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు.

## పాలకమండలిలో కురుమలకు అన్యాయం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 6: కొమురవెల్లి ఆలయ పునరుద్ధరణ కమిటీలో కురుమలకు చోటు కల్పించకపోవడం అన్యాయమని ఆ సంఘం ధూళిమిట్ట మండల ఉపాధ్యక్షుడు కృష్ణ అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో కురుమలకు న్యాయం జరిగిందన్నారు. గతంలో కొమురవెల్లి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా బీఆర్ఎస్ ప్రభుత్వం కురుమలను నియమించిందని గుర్తుచేశారు. కొమురవెల్లిలో జరుగనున్న మల్లన్న స్వామి కల్యాణాన్ని ఒగ్గు జానపద సంప్రదాయ పద్ధతిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రవీణ్, రాజు, పరశురాములు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

హుస్నాబాద్, జనవరి 6 : హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నేడు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని శుభం గార్డెన్స్‌లో సమావేశం ప్రారంభంకానున్నట్లు తెలిపారు. సమావేశానికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, హన్మకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. నియోజకవర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

## అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలి


దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ రజితావెంకన్న

హుస్నాబాద్ టౌన్, జనవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలు కోటి ఆశలతో ఆరు గ్యారెంటీలతో పాటు రేషన్‌కార్డుల కోసం వేలాది మంది దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. నిబంధనల పేరుతో పథకాలకు అర్హులైన వారిని దూరం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో వార్డు ప్రత్యేకాధికారులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



కొలువుదీరిన కొమురవెల్లి మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ

చేర్యాల, జనవరి 6: కొమురవెల్లి మల్లన్న ఆలయ అభివృద్ధికి నూతనంగా నియమితులైన ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం నూతనంగా నియమించిన కొమురవెల్లి మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ కొలువుదీరింది. శనివారం ఆలయ పాలక మండలి కార్యాలయంలో పర్పాటకం లక్ష్మారెడ్డిని కమిటీ చైర్మన్‌గా సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం మల్లన్న క్షేత్రంలో కొమ్మూరి పర్యటించి కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. స్వామివారి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్వామివారి కలాణోత్సవానికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌గౌడ్ తదితరులు హాజరవుతారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, కమిటీ సభ్యులు కొమ్ము రాజేశ్వరి, అంబాల ఉమారాణి, అల్లం శ్రీనివాస్, పయ్యావుల ప్రవీణ్‌యాదవ్, బోయిని సాయియాదవ్, లింగంపల్లి శ్రీనివాస్, ముస్త్యాల దామోదర్, ఎర్రబచ్చలి శ్రీనివాస్, మద్దికుంట శ్రీనివాస్, చిరుమల్ల నర్సింహులు, చీపురు భిక్షపతి, మోహన్‌రెడ్డి, గడ్డం వీరభద్రప్ప, పి.శ్రీనివాస్, తాళ్లపల్లి రమేశ్, కామిడి రమణారెడ్డి, కిరణ్‌కుమార్, బండారు మధుసూదన్, అంజయ్యయాదవ్, ఆలయ ఈవో బాలాజీ, ఏఈవో వైరాగ్యం అంజయ్య పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలి

గజ్వేల్ అర్బన్, జనవరి 6: ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులకు సూచించారు. శనివారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సింగారం, ఎర్రవల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తులు చేసుకుంటున్న మహిళలను పలకరించి.. ఏఏ పథకాలకు దరఖాస్తులు చేసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ బాల్‌రాజు, ఎంపీడీవో మశ్చేంధర్, ఎర్రవల్లి సర్పంచ్ బాలమణీ రాములు, అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

హుస్నాబాద్, జనవరి 6: తెలంగాణ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈనెల 20వరకు పొడిగించినట్లు హుస్నాబాద్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల(బెజ్జంకి) ప్రిన్సిపాల్ మార్తా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ఎస్సీ, బీసీ, ఎస్టీ, ఓసీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## వినోద్‌కుమార్‌పై అసత్య ప్రచారం తగదు

హుస్నాబాద్, జనవరి 6: కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌పై అసత్య ప్రచారం మానుకోవాలని బీఆర్ఎస్ ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతినాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా వినోద్‌కుమార్ సోదరుడి కుమార్తెకు ట్రాన్స్‌కోలో ఉద్యోగం ఇప్పించారని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వారు ప్రస్తావిస్తున్న పేరుతో వినోద్‌కుమార్ బంధువుల్లో ఎవరూ లేరని, పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇలాంటి దుష్ప్రచారానికి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్పడుతున్నారని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో వినోద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు.

### అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు

బెజ్జంకి, జనవరి 6: మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌పై సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల శేఖర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినోద్‌కుమార్ అన్న బిడ్డ విద్యుత్‌శాఖలో అక్రమంగా ఉద్యోగం పొందిందని కొంతమంది సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టులు చేశారని, అది పూర్తిగా అవాస్తవమన్నారు. అసలు వినోద్‌కుమార్‌కు అన్న కూతురు లేదన్నారు.


కోహెడలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ, జనవరి 6 : ప్రజాపాలన ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కోహెడకు వచ్చిన మంత్రికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 13 ఎంపీటీసీల స్థానాల పరిధిలోని నాయకులతో మంత్రి విడివిడిగా మాట్లాడారు. అనంతరం మంత్రిని గజమాలతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య, నాయకులు బస్వరాజు శంకర్, చింతకింది శంకర్, చెట్టి సుధాకర్, గోరిట్యాల లక్ష్మణ్, బండిపెల్లి నారాయణగౌడ్, యాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, గుజ్జుల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాకను ఆకుపచ్చగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


సమీక్షా సమావేశంలో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్న అడిషనల్ జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తదితరులు

దుబ్బాక, జనవరి 6 : మల్లన్నసాగర్ కాల్వల ద్వారా నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరందించి దుబ్బాకను ఆకుపచ్చగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక మల్లన్నసాగర్ ఉపకాల్వల నిర్మాణంపై శనివారం సిద్దిపేట కలెక్టరేట్‌లో అడిషనల్ జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి ఉప్పరపల్లి, రామాయంపేట సాగునీటి ప్రధాన కాల్వలకు సంబంధించిన ఉపకాల్వల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. త్వరగా ఉపకాల్వల నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగు నీరందించాలని సూచించారు. పలుచోట్ల రెవెన్యూ పరమైన సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాల్వల నిర్మాణంతో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించాలని చెప్పారు. కాల్వల నిర్మాణంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పనులు చేపట్టాలన్నారు. రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. కాళేశ్వరం, మల్లన్నసాగర్ ప్రాజెక్టులు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సాగునీటి కష్టాలను శాశ్వతంగా పరిష్కరించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మల్లన్నసాగర్‌తో నియోజకవర్గంలో బీడు భూములు పచ్చని పంట పొలాలుగా మారాయని గుర్తుచేశారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ వేణుబాబు, ఆర్డీవో రమేశ్‌బాబు, ఈఈ సాయిబాబా, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

రాయపోల్, జనవరి 6: దౌల్తాబాద్ మండలం సూరంపల్లి గ్రామంలో రెండు రోజుల నుంచి మహంకాళి మాత, బొడ్రాయయి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతల ఉత్సవాలను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఈ ఉత్సవాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ఉత్సవాలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరం నెలకొందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అయ్యగారి నర్సింహులు, ఎంపీపీ సంధ్యా రవీందర్, వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు పూజితావెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యం, నాయకులు చంద్రారెడ్డి, రవీందర్, వాసుదేవ రెడ్డి, తాలరి నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాజకీయ నాయకులు సహకరించాలి

సిద్దిపేట, జనవరి 6 : తప్పులు లేకుండా ఓటర్ల జబితాను తయారు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రమేశ్‌బాబు కోరారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో ముసాయిదా ఓటర్ల జబితాపై అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా వివరాలపై చర్చించారు. బీఆర్ఎస్ నాయకులు మోహన్‌లాల్, బీజేపీ నాయకుడు పాతూరి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఆత్తు ఇమామ్, బీఎస్పీ నాయకుడు ఉమేశ్ పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో జిల్లాకు పేరు తేవాలి


సిద్దిపేటలో అథ్లెటిక్ క్రీడాపోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సిద్దిపేట, జనవరి 6 : జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లాకు పేరు తీసుకురావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు క్రీడాకారులకు సూచించారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని డిగ్రీ కాలేజీ మైదానంలో అథ్లెటిక్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక కృషితో సిద్దిపేటను క్రీడా హబ్‌గా మార్చామని తెలిపారు. అండర్-14,16 బాలబాలికలు, అండర్-8,10,12 బాలబాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారు గుజరాత్‌లోని అహ్మదాబాద్, కొత్తగూడెంలో జరిగే అథ్లెటిక్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

## సైక్లింగ్ జట్టు మేనేజర్‌గా వెంకటనర్సయ్య

అక్కన్నపేట, జనవరి 6: మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జంగపల్లి వెంకటనర్సయ్య తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ పురుషుల జట్టుకు మేనేజర్‌గా ఎంపికైనట్లు సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9 నుంచి 12 వరకు కర్ణాటకలోని విజయపురలో జరిగే జాతీయ స్థాయి రోడ్ సైక్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుషుల జట్టుకు వెంకటనర్సయ్య మేనేజర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. వెంకటనర్సయ్య ఎంపికపై జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీవైఎస్‌వో నాగేందర్, సిద్దిపేట స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ పాల సాయిరాం, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎంఈవో నరసింహారెడ్డి, హెచ్ఎం రంగా హర్షం వ్యక్తం చేశారు.

## రాజకీయ కక్షతోనే కేసు నమోదు

గజ్వేల్, జనవరి 6: రాజకీయ కక్షతోనే తమపై కేసు నమోదు చేయించారని పట్టణానికి చెందిన గంగుమల్ల శ్రీనివాస్‌రెడ్డి, గుంటుక రాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని వేంకటేశ్వర ఆలయ సమీపంలో తాము కొనుగోలు చేసిన సర్వే నంబర్‌లో సుమారు 500 ఇండ్ల నిర్మాణాలు చేపట్టారని, తాము కొనుగోలు చేసిన స్థలం వక్ఫ్ భూమి అంటూ కక్ష పూరితంగా కేసు పెట్టారని తెలిపారు. గెజిట్ నంబర్ 46'ఎ'ను రాష్ట్ర హైకోర్టు 2016లో రద్దు చేసిందన్నారు. రద్దు చేసిన నోటిఫికేషన్‌తో తమపై ఫిర్యాదు చేసే అధికారం మహ్మద్ అబ్దుల్ వాహిద్‌కు లేదన్నారు.

## కూడవెల్లి జాతరకు టెండర్లు

దుబ్బాక, జనవరి 6 : దక్షిణ కాశీగా పేరొందిన కూడవెల్లి రామలింగేశ్వరాలయం వద్ద మాఘ అమావ్యాస సందర్భంగా వారం రోజులపాటు జాతర కొనసాగనుందని ఆలయ అర్చకుడు సంకేతశర్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు జాతరకు సంబంధించిన పలు వాటికి టెండర్లు నిర్వహిస్తామన్నారు. ఆలయంలో టెంకాయ విక్రయం, నూనె గురుగులు, ప్యాలాలు, పుట్నాలు, ప్రసాదం, కల్యాణ మండపం కిరాయి తదితర వాటి కోసం బహిరంగ వేలం పాటతోపాటు టెండర్లు వేస్తామన్నారు.

## హత్య కేసులో నిందితుల అరెస్ట్

సిద్దిపేట టౌన్, జనవరి 6 : హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. శనివారం సిద్దిపేట వన్‌టౌన్ సీఐ మీడియాకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బోయిగల్లికి చెందిన వేదశ్రీ 2014లో నాసర్‌పూరకు చెందిన దరిపల్లి వెంకటేశ్‌తో వివాహం జరిగింది. కొంతకాలం తర్వాత వీరికి ఒక పాప జన్మించింది. అదనపు కట్నం తీసుకురావాలని వేదశ్రీని వెంకటేశ్ వేధించేవాడు. ఈ క్రమంలో వెంకటేశ్ ట్రాన్స్‌జెండర్‌గా మారి తిరుగుతూ అసభ్యంగా ప్రవర్తించేవాడు. తన పరువు పోగొడుతున్నాడని భర్తపై భార్య పగ పెంచుకుంది. అతడి అడ్డు ఎలాగైనా తొలిగించుకోవాలని కుట్ర పన్నింది. తనకు పరిచయం ఉన్న బోయిని రమేశ్‌ను కలిసి వెంకటేశ్‌ను హత్య చేస్తే రూ.18 లక్షలు ఇస్తానని చెప్పింది. అడ్వాన్స్‌గా రూ.4 లక్షల 60వేలు రమేశ్‌కు ఇచ్చింది. గతేడాది డిసెంబర్ 11న వెంకటేశ్ అలియాస్ రోజాకు బీర్ తాగించి నిద్రిస్తున్న సమయంలో వేదశ్రీ, రమేశ్‌తో పాటు శేఖర్ కలిసి దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. పోలీసుల దర్యాప్తులో వెంకటేశ్‌ది హత్య అని తేలడంతో భార్యతో పాటు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# చైర్మన్‌పై అవిశ్వాసం అవాస్తవం

- కాంగ్రెసోళ్లు తప్పడు ప్రచారం మానుకోవాలి
- మేమంతా పార్టీకి విధేయులం
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- సిద్దిపేట బీఆర్ఎస్ కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు

సిద్దిపేట, జనవరి 6 : సిద్దిపేట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పేరుతో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రచారం అవాస్తవమని, అసత్య ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్లు తెలిపారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టి మరల్చడానికి కుట్రలు చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్‌కు చైర్మన్ పెద్దన్నలా అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే వ్యక్తి అన్నారు. అలాంటి వ్యక్తిపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవసరం తామకు లేదన్నారు. ప్రభుత్వం లేనప్పుడే సిద్దిపేట మున్సిపల్‌పై బీఆర్ఎస్ జెండా ఎగిరిందన్నారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఎమ్మెల్యే హరీశ్‌రావు సిద్దిపేట మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపారన్నారు. కౌన్సిలర్లు డిసెంబర్ 31 వేడుకలకు హైదరాబాద్‌కు వెళ్తే అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగిందని కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ఇటీవల హైదరాబాద్‌కు ఎమ్మెల్యే హరీశ్‌రావుకు శుభాకాంక్షలు చెప్పేందుకు వెళ్లి వ్యక్తిగతంగా పార్టీ చేసుకుంటే కొన్ని పత్రికల్లో తప్పుడు కథనాలు వచ్చాయన్నారు. సిద్దిపేట కౌన్సిలర్లంతా ఒకే తాటిపై ఉన్నామని, తామంతా పార్టీకి, మాజీ మంత్రి హరీశ్‌రావుకు విధేయులమని తెలిపారు. మా మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు.

### అవినీతి ఆరోపణలపై కౌన్సిల్ సభ్యుల ఆగ్రహం..

మున్సిపల్ చైర్మన్‌పై అవినీతి ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే చర్చకు రావాలని, లేదంటే జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు సవాల్ విసిరారు. చైర్మన్‌పై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లపై తప్పుడు ప్రచారం చేయొద్దన్నారు. అవినీతి జరిగే అవార్డులు ఎందుకు వస్తాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు.

### సమష్టి కృషికి అవార్డు నిదర్శనం..

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సిద్దిపేటకు అవార్డు రావడం మున్సిపల్ పాలకవర్గం సమష్టి కృషికి నిదర్శనమన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశం, ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత అవార్డు వచ్చిందన్నారు. సిద్దిపేటకు స్వచ్ఛ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 11న మున్సిపల్ చైర్మన్ ఢిల్లీలో అవార్డు అందుకుంటారని తెలిపారు. సిద్దిపేటలో అభివృద్ధి జరిగింది కాబట్టే అవార్డులు వస్తున్నాయన్నారు. ఇదే స్ఫూర్తితో అందరం కలిసి కట్టుగా ముందుకుసాగుతామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు బ్రహ్మం, లక్ష్మణ్, రవీందర్, సుందర్, డాక్టర్ విఠోబా, నాగరాజు, చంద్రం, సాయిశ్వర్‌గౌడ్, విజేందర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, మల్లికార్జున్, యోగి, సాయికుమార్, సతీశ్, వినోద్‌గౌడ్, నాయకులు ఆత్తర్ పటేల్, సురేశ్, ఎల్లంయాదవ్, వజీర్, మొయిజ్, రాజు, రాజేశం, శ్రీనివాస్‌యాదవ్, నాగరాజు, తిరుమల్‌రెడ్డి, రాఘురామ్, మహేందర్, పాతురి శ్రీనివాస్‌రెడ్డి, ఉదర మణిదీప్‌రెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.